అద్భుతాన్ని సాధించిన అతను ఆలోచించని ఆ భయంకర పరిస్థితి?

బలభద్రపాత్రుని
ఉదయశంకర్
కధ

# భావితరాల బాటలలో...

భారత రాజధాని నగరం!

ఆసియా మెడికల్ కౌన్సిల్ భవనం. ఆ భవనం మూడో అంతస్తులో. ఆ సంస్థ డైరక్టర్ డాక్టర్ త్రివేది తన ఏర్‌కండిషన్డ్ ఛాంబర్‌లో కూర్చుని వున్నాడు. అతని ఎదురుగా ప్రముఖ వైద్య శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవాత్సవ కూర్చుని వున్నాడు.

డాక్టర్ త్రివేది తన రివాల్వింగ్ చెయిర్‌లో సర్దుకుని కూర్చుంటూ "మిస్టర్ శ్రీవాత్సవ్ ఇప్పుడు చెప్పండి. మీరు చేసిన పరిశోధనలూ, వాటి ఫలితాల వివరాలు" అన్నాడు.

తన చేతిలో వున్న ఫైల్‌ను టేబుల్ మీద పెట్టి చెప్పడం ప్రారంభించాడు శ్రీవాత్సవ్.

"సర్! వైద్యశాస్త్రరంగం ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నది. ఈ సృష్టిలో అసాధ్యమైన విషయాలనెన్నింటినో తన నిరంతర కృషిద్వారా తన అధీనంలోకి తెచ్చుకోగలిగాడు మానవుడు. కానీ ఎన్ని అసాధ్యాలను సుసాధ్యాలుగా చేసినా కొన్ని కొన్ని విషయాలు మాత్రం మానవుని మేధస్సును సవాల్ చేస్తూనే వున్నాయి" అని ఒక్క క్షణం ఆగి ఊపిరి తీసుకుని మళ్ళీ చెప్పసాగాడు.

డాక్టర్ త్రివేది మౌనంగా వింటున్నాడు.

"తను అనుకున్నది సాధించగలుగుతున్న మానవుడు తను పొందాలనుకున్న బిడ్డ విషయంలో మాత్రం కేవలం అదృష్టాన్నే నమ్ముకోవలసి వస్తోంది"

"అంటే" అర్థం కానట్లుగా అడిగాడు



త్రివేది.

"మానవ మేధస్సు అంతరిక్షంలోకి దూసుకుపోతున్న ఈ యుగంలో కూడా తనకు ఆడబిడ్డ కావాలంటే ఆడబిడ్డని, మగబిడ్డ కావాలంటే మగబిడ్డని పొందలేక పోతున్నాడు. ఈ అసంతృప్తిలో ఒక్కొక్కసారి తీవ్రమైన మానసిక వత్తిడికి కూడా లొంగిపోవడం జరుగుతుంటుంది" శ్రీవాత్సవ కం

ఠంలో రవ్వంత ఆవేశం ప్రతిధ్వనించింది.

శ్రీవాత్సవ్ చెప్పినదానికి మద్దతుగా "అవును స్త్రీ పురుష సంగమంతో నిమిత్తం లేకుండానే టెస్ట్ ట్యూబ్ బేబీని సృష్టించగలగుతున్నాం కానీ ఆ బేబీ సెక్స్‌ని ముందుగానే నిర్ధారించ లేకపోతున్నాం" అన్నాడు డాక్టర్ త్రివేది.

మళ్ళీ అతనే అన్నాడు "ఈ విషయంలో ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. కానీ ఫలితాన్నెవ్వరూ సాధించలేకపోయారు'

"దానిని నేను సాధించాను సర్" కళ్ళల్లో విజయగర్వం మెరుస్తుండగా చెప్పాడు డాక్టర్ శ్రీవాత్సవ్.

ఒక్కసారి కుర్చీలోంచి ముందుకు వంగి "వ్వాట్! ఆర్ యూ టెల్లింగ్ ట్రూత్?" అన్నాడు త్రివేది ఆశ్చర్యంగా.

"ఎస్ సర్. ఈ విషయంలో విజయం సాధించాను. తను కోరుకున్న బిడ్డను మానవుడు పొందగలిగే ఫార్ములాని కనుగొన్నాను" అన్నాడు శ్రీవాత్సవ్ అమితమైన ఆనందంతో.

"ఎలా సాధ్యం. పూర్తి వివరాలు చెప్పండి." డాక్టర్ త్రివేది గొంతులో ఆసక్తి ఆతృత తొణికిసలాడాయి.

చెప్పడానికి ఉద్యుక్తుడయ్యాడు శ్రీవాత్సవ్.

"స్త్రీ పురుష సమ్మాగంలోను, గర్భధారణలోను సెక్స్ క్రోమోజోమ్ ప్రముఖ పాత్ర వహిస్తాయి. పురుషుడి వీర్యంలో ఎక్స్ వై అనే క్రోమోజోమ్స్, స్త్రీ అండంలో ఎక్స్ ఎక్స్ అనే క్రోమోజోమ్స్ ఎక్స్ ఉంటాయికదా. పురుషునిలోని ఎక్స్ క్రోమోజోమ్స్‌లో కలిస్తే ఆడబిడ్డ పురుషునిలోని వై క్రోమోజోమ్స్ స్త్రీలోని ఎక్స్ క్రోమోజోమ్స్‌తో కలిస్తే ఆడబిడ్డ, పురుషునిలోని వై క్రోమోజోమ్స్, స్త్రీలోని ఎక్స్ క్రోమోజోమ్స్ కలిస్తే మగబిడ్డ జన్మించడం జరుగుతుంది. అంటే పుట్టబోయే శిశువు సెక్స్‌ను నిర్ధారించేది పురుషునిలోని క్రోమోజోమ్స్ మాత్రమే. కాబట్టి పురుష క్రోమోజోమ్స్‌పై పూర్తి నియంత్రణ కలిగి వుండడంద్వారా జన్మించబోయే బేబి సెక్స్‌ను నిర్ధారించవచ్చు." అని చెప్పడం ఆపి డాక్టర్ త్రివేది వైపు చూసాడు శ్రీవాత్సవ్.

డాక్టర్ త్రివేది సాలోచనగా చూస్తూ మీరు చెప్పిందంతా బాగానే వుంది. కానీ ఆ కంట్రోల్ సాధించడం అసాధ్యంకదా" అన్నాడు.

"తనకు అనవసరం అనుకున్న క్రోమోజోమ్స్‌ని నిర్జీవం చేయడంద్వారా సాధ్యమే. అంటే ఆడపిల్ల కావాలంటే పురుషునిలోని వై క్రోమోజోమ్స్‌ని నిర్జీవం చేయాలి. అప్పుడు కేవలం ఎక్స్ ఎక్స్ క్రోమోజోమ్స్ మాత్రమే కలుస్తాయి. అలాగే మగబిడ్డ కావాలంటే పురుషునిలోని ఎక్స్ క్రోమోజోమ్స్‌ని నిర్జీవం చేయాలి. అలా క్రోమోజోమ్స్ నిర్జీవం చేసే ఫార్ములాని నేను కనుగొన్నాను" అన్నాడు శ్రీవాత్సవ తన పరిశోధనల సారాన్ని విపులీకరిస్తూ.

సంభ్రమంగా చూస్తూ అన్నాడు డాక్టర్ త్రివేది "వండర్‌ఫుల్ డాక్టర్ శ్రీవాత్సవ్! ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది కనుగొనలేని

అపూర్వ విషయాన్ని మీరు సాధించారు. కంగ్రాట్యులేషన్స్"

"థాంక్యూసర్. కానీ ఈ ఫార్ములా గురించి ప్రపంచానికి తెలియపరచాలి. అందుకే మీ సంస్థ సహాయాన్ని అర్థిస్తున్నాను" అన్నాడు శ్రీవాత్సవ వేడుకోలుగా.

"ష్యూర్! ష్యూర్! వచ్చేనెలలో జరుగబోయే వరల్డ్ మెడికల్ కాన్ఫరెన్స్‌లో మీ పేపర్స్ సబ్మిట్ చేయడానికి మెడికల్ కౌన్సిల్ తరఫున మీకు అవకాశం వచ్చే ఏర్పాటు చేస్తాను. లెట్ ద వరల్డ్ నో యువర్ టాలెంట్"

డాక్టర్ శ్రీవాత్సవ ఆనందానికి అవధుల్లేవు. సంతోషంతో నోట మాట రావట్లేదు. ఉద్వేగ పూరితంగా కొట్టుకుంటున్న గుండెని కంట్రోల్ చేయడానికి ప్రయత్నిస్తూ అతికష్టంమీద వన్స్ ఎగైన్ థాంక్యూసర్" అని మాత్రం అనగలిగాడు.

కుర్చీలోంచి లేస్తున్న శ్రీవాత్సవ్‌కు షేక్‌హేండ్ ఇస్తూ "విష్ యు గుడ్‌లక్ మిస్టర్ శ్రీవాత్సవ్" అన్నాడు డాక్టర్ త్రివేది.

శ్రీవాత్సవ్ అక్కడినుండి నిష్క్రమించాడు.

* * *

డాక్టర్ శ్రీవాత్సవ్ హృదయం అంతులేని ఆనందంతో ఉక్కిరిబిక్కిరౌతోంది. తన ప్రతిభను ఈ ప్రపంచం గుర్తించబోతోంది. వైద్యశాస్త్ర రంగంలో అపూర్వమైన విజయాన్ని సాధించినందుకు తనకు తన ద్వారా తన మాతృభూమికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు ఇనుమడించబోతున్నాయి. ఈ ఊహ కలగగానే అతని హృదయ స్పందన వేగం హెచ్చింది. కనుకొలకుల్లో నీటి ముత్యాలు మెరిసాయి.

ఈ సంతోషాన్ని మనసారా పంచుకునే భాగస్వామి కావాలి. ఆ భావన కలగగానే అతని మనోఫలకంపై మృణాళిని రూపం తళుక్కున మెరిసింది. అవును! తన జీవితం కన్నా విలువైన ప్రియమైన తన జీవనోద్యాన

## ప్లాస్టిక్ భవనాలు



ప్లాస్టిక్‌తో తయారుచేయని వస్తువంటూలేదేమో! త్వరలో ప్లాస్టిక్ భవనాలు నిర్మాణం కాబోతున్నాయి. అత్యధిక నాణ్యతగల ప్లాస్టిక్‌తో నిర్మించిన మొట్టమొదటి గృహానికి ఇటీవల అమెరికాలోని పిట్స్‌ఫీల్డ్‌లో ప్రారంభోత్సవం జరిగింది. నలుగురు వ్యక్తులుగల ఓ కుటుంబం కోసమై 280 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన ఈ రెండంతస్తుల ప్లాస్టిక్ భవనం నిర్మాణానికి, పరిశోధన, అభివృద్ధికి ఒకకోటి డాలర్లు ఖర్చయింది. కాలక్రమేణా నిర్మాణ వ్యయం తగ్గి అందరికీ అందుబాటులోకి రాగలదని ఆశించవచ్చు.

—పమ్మొట గోవర్ధన్

వసంత లక్ష్మి మృణాళిని.

నిజానికి ఈ విజయం తనదికాదు. తనలో సగభాగమైన ఆమెది!

స్వప్న వాస్తవాల మధ్య ఊగిసలాడే హృదయంతో హైదరాబాద్ ఎలా వచ్చాడో, తన ఇంటికి ఎలా చేరుకున్నాడో కనీసం అతనికి కూడా సరిగ్గా గుర్తులేదు.

* * *

ఆసియా మెడికల్ కౌన్సిల్ ద్వారా తన భర్తకు రాబోతున్న కీర్తి ప్రతిష్టలు ఒకప్రక్క ఆనందపరచినా అతని పరిశోధనలలో మాత్రం ఒక బలమైన అపశృతి గోచరించింది మృణాళినికి.

అతని పరిశోధనలవలన సమాజానికి కలగబోయే హానిని ఊహించుకుంటే భయంకరంగా కనిపించసాగింది. తన ఊహలను అతని ముందుంచితే అతను డిసప్పాయింట్ అవవచ్చు. కానీ ముందుతరాల శ్రేయస్సును దృష్టిలో వుంచుకుంటే అది అనివార్యం. ఆమె ఓ స్థిరనిర్ణయానికి వచ్చింది.

"మీ పరిశోధనల ప్రభావం సమాజం మీద ఏవిధంగా వుంటుందో ఒక్కసారి ఆలోచించారా" కూల్‌గా అడిగింది.

"అద్భుతంగావుంటుంది. జన్మించబోయే బేబి సెక్స్‌ను గురించి మనిషికి అసలు టెన్షన్ సమస్యే వుండదు. అంతేకాదు. గర్భకోశ కాన్సర్ లాంటి వ్యాధులకు జన్మించబోయే బేబి సెక్స్‌ను ముందుగానే నిర్ధారించడంద్వారా దూరం చేయవచ్చు. ఇంకా....'

అతని వాగ్ధాటిని మధ్యలోనే ఆపివేసింది మృణాళిని.

"దీనియొక్క నెగటివ్ ఇన్‌ఫ్లూయన్స్‌గురించి ఆలోచించారా"

శ్రీవాత్సవ్ భృకుటి ముడివడింది. "నెగటివ్ ఇన్‌ఫ్లూయన్సా" ఆశ్చర్యంగా అడిగాడు. ఆమె అంతరంగం ఏమిటో అతనికి బోధపడలేదు.

ఆమె ప్రశాంతంగా చెప్పింది. "అవును. మీ పరిశోధనల ప్రభావం మన తరువాతి తరంమీద ఎంత విషముద్ర వేస్తుందో తెలుసా? ఈ పురుషాధిక్య సమాజంలో స్త్రీకున్న విలువెంత? చూస్తూ చూస్తూ కోరి ఆడపిల్లను కనాలనుకునే దంపతులెంత మంది వుంటారు? చట్టరూపంగా సమాన హక్కు కల్పించబడిన స్త్రీ వాస్తవంలో మాత్రం పురుషునితో సమానంగా పరిగణించబడలేకపోతోంది. ప్రపంచంలో నైతిక విలువల పతనం ప్రారంభమైన నాటినుంచి స్త్రీ విలువ తగ్గుతూ వచ్చింది."

అతను మధ్యలో ఏదో చెప్పబోయాడు. కానీ ఆమె ఆవేశం అతనిని చెప్పనివ్వలేదు.

"మీరు కనుగొన్న ఫార్ములాకి మంచి పబ్లిక్ రెస్పాన్స్ వుంటుందనడంలో సందేహం లేదు. కానీ ఈ ఫార్ములాని ఫాలో అయ్యేవారిలో అత్యధిక శాతంమంది కోరుకునేది మగబిడ్డనే. ఆడపిల్ల అంటే గుండెలమీద కుంపటి అని భావించే ఈ యుగంలో ఆ కుంపటిని కోరుకునే సాహసికులెంతమంది వుంటారు? ఇప్పటికే అల్ట్రా సౌండ్ దయాగ్నసిస్ ద్వారా జన్మించబోయే శిశువు సెక్స్‌ను ముందుగానే తెలుసుకుని ఆడపిల్ల అని తెలిసిన వెంటనే ఎంతోమంది అబార్షన్స్

చేయించుకుంటున్నారు. ఇప్పుడు ఈ కొత్త ఫార్ములా వలన ఆ అబార్షన్స్ చేయించుకునే అవసరం కూడా వుండదు. గర్భధారణకు ముందే శిశువు సెక్స్‌ను నిర్ధారించుకోవచ్చు. సహజంగానే అధికశాతం ప్రజలు మగబిడ్డనే కోరుకుంటారు''

''ఈ ప్రకారం చూస్తే ప్రపంచ జనాభాలో స్త్రీల శాతం అతివేగంగా తగ్గిపోతుంది. కొన్ని దశాబ్దాలకి స్త్రీ జాతి నామమాత్రంగా మిగిలిపోతుంది. అదీ ఏ కొద్దిమందో ముందుచూపుతో తీసుకున్న జాగ్రత్తల వలన! ఉన్న కొద్ది మంది స్త్రీలపై జరిగే అత్యాచారాలకు అంతు వుండదు. వ్యభిచారం, సెక్స్ నేరాలు పెచ్చుపెరిగిపోతాయి. వరకట్నాలు అంతరించి కన్యాశుల్కాలు తిరిగి తలెత్తుతాయి. ఇంకా... ఇంకా... ఎన్ని ఘోరార విపత్తులు జరుగుతాయో ... మైగాడ్! తలచుకుంటేనే ఒళ్లు జలదరిస్తోంది'' ఆమె చాలా ఆవేశంగా చెప్పింది.

మృణాళినిలో అంత ఆవేశం శ్రీవాత్సవ ఎప్పుడూ చూడలేదు. అతను ఆశ్చర్యం నుంచి తేరుకోవడానికి కొంత సమయం పట్టింది.

ఆమె మళ్ళీ చెప్పింది ''మీరే ఆలోచించండి. ఈ ఫార్ములా వలన కలిగే ప్రయోజనం కన్నా నష్టమే కొన్నివందల రెట్లు ఎక్కువ. ఇది ఏ ఒక్క దేశానికో సంబంధించినది కాదు. సత్పరిణామంగానీ, దుష్పరిణామంగానీ ఏదైనా మొత్తం ప్రపంచంమీదే వుంటుంది''

ఆనంద శిఖరాలపై నాట్యం చేస్తున్న శ్రీవాత్సవ్ మనసు ఒక్కసారిగా ఆలోచనల పాతాళానికి త్రొక్కివేయబడింది.

అతని మస్తిష్కంలో మృణాళిని మాటలు మార్మోగుతున్నాయి.

శాస్త్రవేత్తల లక్ష్యం కేవలం కొత్త విషయాల సృష్టి మాత్రమేకాదు. దాని పర్యవసానాన్ని భిన్నకోణాలనుంచి వీక్షించగల దృష్టి కూడా! విజ్ఞానశాస్త్రం అగ్నివంటిది. దానిని సక్రమంగా ఉపయోగించుకుంటే భావితరాల బాటలలో వెలుగులు విరజిమ్ముతుంది. చిన్నపొరపాటు జరిగినా మొత్తం ప్రపంచాన్ని దహించి వేస్తుంది.

* * *

తెల్లవారింది. అగ్నికి ఆహుతి అయిపోతున్న తన ఫార్ములా తాలూకు ఫైలు వంక నిశ్చలంగా చూస్తూ నిలబడ్డాడు డాక్టర్ శ్రీవాత్సవ్. భుజంపై చెయ్యి పడినట్టయి వెనక్కి తిరిగి చూసాడు.

సుడులు తిరుగుతున్న కన్నీటి బిందువుల్లోంచి మృణాళిని రూపం అస్పష్టంగా కనిపించింది.

''మీ మేధస్సు కాలిపోవడంలేదు. కొలిమిలో బంగారంలా కొత్త మెరుగులు దిద్దుకుంటున్నది'' అని ఆమె కళ్ళు మౌనంగా చెప్తున్నాయి.

అక్షరరూపం దాల్చిన అతని అపాలజి రెక్కలు విప్పుకుని రివ్వున ఎగిరింది డాక్టర్ త్రివేదిని చేరడానికి.